# పేరు మారింది...

గదిలో కూర్చుని ఆఫీసు కాగితాలు సర్దుకుంటుంటే సుమిత్ర రుసరుసలాడుతూ వచ్చింది. ఎవరి మీదో కంప్లైంట్ చేయబోతోందని నాకు ఇట్టే అర్థమైపోయింది.

"వెన్నునొప్పికి రెస్టు తీసుకుంటూ మందులు వాడమని డాక్టరుగారు అత్తయ్యకి చెప్పారు కదా, అయినా సరే..."

సుమిత్ర చెప్పబోయేదేమిటో తెలివిగా ముందే గ్రహించేసినట్లుగా ఆమె మాటలకు అడ్డంపడి "డాక్టరు చెప్పినట్లుగా మందులు ఎందుకు వేసుకోవటం లేదో అమ్మని గట్టిగా అడుగుతాన్లే! బోలెడు డబ్బుపెట్టి కొన్నవేగానీ ఉత్తినే రాలేదుగా...!" అన్నాను.

సుమిత్ర విసుక్కుంది. "పూర్తిగా వినరూ... తొందరెక్కువ...!"

"అది నిజమేలే! అందుకేగా మన పెళ్ళిచూపులరోజున మా నాన్నతో చీవాట్లు తిన్నానూ...!" అన్నాను.

"ఎందుకు చీవాట్లేశారూ...?" ఆశ్చర్యంగా అడిగింది.

"నిన్ను చూసి మేం ఇంటికి వెళ్ళేసరికి ఒకాయన పెద్ద కట్నంతో సంబంధం తెచ్చాడు. నీతో మాట్లాడినప్పుడు నువ్వు నచ్చినట్లుగా చెప్పేశానని నాన్నతో అనేసరికి 'ఇంటికి వచ్చాక ఏ సంగతీ కబురు పంపించటం పద్ధతి... నీకంత తొందరెందుకూ...?' అంటూ కోప్పడ్డాడు!" చిరునవ్వుతో చెప్పాను.

సుమిత్ర నవ్వింది.

తరవాత నిదానంగా... నిష్టురంగా చెప్పింది. "పక్కింటి అన్నపూర్ణమ్మగారూ వాళ్ళంతా వాళ్ళ బంధువులాయన నడుపుతున్న యాత్రాస్పెషల్‌లో రామేశ్వరం, మధుర వగైరా ఊళ్ళన్నీ తిరిగి వస్తారట.

'రాత్రిపూట ట్రైనులో విశ్రాంతిగా పడుకుని పగలు ఊరు చూసేట్లుగా ప్లాను చేశారు, మీరు వస్తారా' అని ఆవిడ అత్తయ్యను అడుగుతుంటే సమాధానం తనే చెప్పొచ్చుగదా, మిమ్మల్ని అడుగుతానని చెబుతున్నారు...!"

"ఇంతేగదా... సరేలే, అలాగే వెళ్ళిరమ్మని అమ్మకి చెబుతాను" అన్నాను.

సుమిత్ర నావేపు చురుగ్గా చూసింది. ఆ చూపుల్ని మాటల్లోకి అనువదిస్తే మీ తెలివి తెల్లారినట్లే ఉంది. అని అర్థం వస్తుంది.

"అయితే ఇంతకీ ఏం చెప్పాలంటావూ....?" బుద్ధిగా అడిగాను.

"వెన్నునొప్పితో ప్రయాణాలేమిటని చెప్పేయండి. మా చెల్లెలు పెళ్ళి కూడా దగ్గరకొచ్చిందిగా, నేనేమో అటూ ఇటూ తిరుగుతూంటే, ఇంటి పని చూసుకునే దెవరూ...? పెద్దావిడకు ఆ మాత్రం ఆలోచన ఉండొద్దూ..." అంది!

'రెస్టు తీసుకోమని చెప్పిన డాక్టరుగారు ఇంటి పనికి మినహాయింపు ఇచ్చారా?' అని అడుగుదామనుకున్నా కానీ ఆ ప్రశ్న అనవసరమైన వాగ్యుద్ధానికి దారితీస్తుందేమోనని విరమించుకున్నాను. మహాభారత యుద్ధం జరిగినన్ని రోజులు వాదించినా సుమిత్రచేత నా పాయింటును ఒప్పించలేనని నాకు తెలుసు మరి. సహాయ నిరాకరణోద్యమం ద్వారా నైనా తన నిర్ణయానికే గెలుపు సాధించుకోగల సత్తా సుమిత్రకు ఉంది! యుద్ధ నైపుణ్యం బొత్తిగాలేని నేను శాంతి పావురంగా మారిపోయి సంసారాన్ని సాగిస్తున్నాను!

ఇంతలోనే అమ్మ వచ్చింది. సుమిత్ర చెప్పిన సంగతే అడిగింది.

అలమరాలోని వస్తువుల్ని సర్దుతున్నట్లుగా సుమిత్ర అక్కడే నిలబడిపోయింది. "వెన్నునొప్పి పూర్తిగా తగ్గకుండా ఇపుడు యాత్రలకి తొందరేమొచ్చిందమ్మా... వచ్చే సంవత్సరం వెళ్ళొచ్చులే..." కచ్చితంగానే చెప్పేశాను.

పాఠాన్ని బాగానే అప్పచెప్పానన్నట్లుగా పాస్‌మార్కులేసే చూపుని సుమిత్ర నావేపు ప్రసరించింది!

అమ్మ నిట్టూర్చి ఊరుకుంది.

ఒక క్షణం ఆగి అంది "రేపు నువ్వు ఆఫీసు పనిమీద నెల్లూరు వెళ్ళాలన్నావుగా, కాంతారావు మామయ్యని కలిసిరా... ఆగ్రా దగ్గరున్న యోగాశ్రమానికి ఇద్దరూ వెళ్ళొస్తామని చెప్పారు కదా, ఈ పాటికి తిరిగి వచ్చేసి ఉంటారు. అక్కడ ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారో వాళ్ళకి ఎలావుందో తెలుసుకురా... వెన్నునొప్పి తగ్గినట్లే తగ్గి మళ్ళీ వచ్చేస్తోందని చెప్పి వైద్యానికి ఈ సారి వాళ్ళు ఇంకెక్కడికైనా వెళ్తోంటే, నేనూ వస్తానని చెప్పు ఏం చేస్తాం.... ఏ పుట్టలో ఏ పాముందో అన్నట్లుగా ఎవరి హస్తవాసి వల్ల తగ్గుతుందో... ప్రయత్నం చేసుకోవాలిగదా...!"

"అలాగే" అనగానే అమ్మ వెళ్ళిపోయింది.

సుమిత్ర నా దగ్గరకు వచ్చి "అత్తయ్యకి చాదస్తం కాకపోతే... ఈ ఊళ్ళోని డాక్టర్లకు లేని కొమ్ములు పొరుగూరు వాళ్ళకి ఉంటాయా...?! అది సరే గానీ చెప్పటం మర్చిపోయాను... నేనూ రేపు రాజమండ్రి వెళ్ళాలి. మా వాళ్ళు పెళ్ళిబట్టలకి నన్నూ రమ్మంటున్నారు..." అంది.

"ఏం...! ఈ ఊళ్ళో దొరకవా?"

“ఎప్పుడూ ఇక్కడేగా కొంటాం, పెళ్ళి బట్టలకి ప్రత్యేకత ఉండాలిగా! రాజమండ్రిలో ఉండే మా పిన్ని వాళ్ళమ్మాయి పెళ్ళప్పుడు బట్టలకి విజయవాడ వెళ్ళింది. విజయవాడలోని పెద్దమ్మ వాళ్ళమ్మాయి పెళ్ళికి కంచి వెళ్ళి కొనుక్కొచ్చింది!” అంటూ నవ్వింది.

కాంతారావు మామయ్య వాళ్ళు మాకు దూరపు బంధువులే అయినా బాగా దగ్గరరగా అనిపిస్తారు. ఆ మామయ్యకూ, అత్తయ్యకూ కూడా ఏవో చిన్న చిన్న మొండి రోగాలున్నాయి. చిన్న చిన్న రోగాలే ఎక్కువ చికాకును తెచ్చిపెడుతుంటాయని మామయ్య అంటుంటాడు. ఏ రోగమైనా తగ్గినట్లే తగ్గి మళ్ళీ వచ్చేస్తుంటుందని ఇంగ్లీషు మందుల మీద నమ్మకం లేదు. అందుకే మామయ్య మూలికా వైద్యమనో, మరోటనో తమిళ, కన్నడ, మలయాళీ వైద్య ప్రక్రియల్ని ఆశ్రయించాడు. అంటే... దక్షిణాది రాష్ట్రాల్లోని వివిధ యోగాశ్రమాల్నీ ప్రకృతి చికిత్సాలయాల్నీ పర్యటించేసి ఇక ఉత్తరాదివేపు దృష్టి కొనసాగించాడు.

ఏ రోగానికి ఏ చికిత్సా విధానం బాగుంటుందీ, ఏ ఊళ్ళో అయితే మంచిదీ వగైరా సమాచారం పొందటానికి మా బంధువర్గంలోని వాళ్ళు మామయ్యని రెఫరెన్స్‌గా భావిస్తారు. అమ్మకీ పూర్తిగా నయం కాకుండా తరచూ తిరగబెట్టే వెన్నునొప్పి ఉంది. అందుకే నెల్లూరు వెళ్ళినప్పుడల్లా మామయ్యని కలిసి ఎక్కడైనా గ్యారంటీగా నయమవుతుందనే కొత్త సమాచారం ఉందేమోనని నన్ను కనుక్కురమ్మంటుంది!

నేను కిందటిసారి నెల్లూరు వెళ్ళినప్పుడు మామయ్యా వాళ్ళు అప్పుడే కేరళలోని ఏదో ఊరునుంచి తిరిగి వచ్చారు.

నేను మామయ్య ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని “బావుందా... మామయ్యా?” అనడిగాను. మామయ్యేమో హుషారుగా కేరళ అందచందాల్ని వర్ణించేస్తూ... సాగరతీరాలూ, కొబ్బరితోటలూ చాలా బావుంటాయిరా అంటూ ఎన్నో కబుర్లుచెప్పాడు.

ఆరోగ్యం ఎలా ఉందనీ, అక్కడ ట్రీట్‌మెంట్ బావుందా అనీ మళ్ళీ అడిగాను.

“ప్చ్...” అంటూ మామయ్య పెదవివిరిచేడు. “ మా జబ్బులు మాత్రం చెక్కుచెదరకుండా అలాగే పదిలంగా ఉన్నాయిరా...” అంటూ నవ్వాడు. మామయ్యకి అరికాళ్ళల్లో మంటలూ, అత్తయ్యకేమో చెవుల్లో హోరులా ఉండి సరిగా వినపడకపోవటమూ... ఇవే వాళ్ళ మొండి రోగాలు.

“ఏ రోగమైనా నూటికి నూరుపాళ్ళు నయం చేస్తామని గ్యారంటీ ఇస్తేనేగా అక్కడికి వెళ్ళాం! వెళ్ళాక మనం రోజు వారీ ఏం తింటామో, మనకేవి ఇష్టమో అవన్నీ తెలుసుకుని, అవేవీ తినకుండా కఠిన పథ్యం చేస్తేనే వాళ్ళ మందు పనిచేస్తుందనీ, అప్పుడే గ్యారంటీ ఇస్తామనీ అంటారు. అలాంటి పథ్యం ఎవరూ చేయలేరనీ వాళ్ళకీ తెలిసే అలా గ్యారంటీ ఇస్తున్నారనిపించింది. ముందుగా వాళ్ళకి కట్టిన ఫీజుకి నీళ్ళొదిలేసుకుని... ‘మీరు చెప్పిన పథ్యం చేస్తే ఆరోగ్యం సంగతి ఏమోగానీ మాకు మోక్షం మాత్రం వెంటనే సిద్ధించటం ఖాయం, మాకింకా కొద్దికాలం బతకాలనుంది కాబట్టి సెలవు తీసుకుంటాం’, అని చెప్పి చక్కా వచ్చేశాం!” అన్నాడు మామయ్య నవ్వుతూ...

“ఆగ్రా దగ్గర గౌరీనాథ్ అనే సిద్ధయోగి ఆశ్రమం ఉందట. అక్కడ వారంరోజులుంటే చాలట ఎలాంటి రోగమైనా పారిపోవాల్సిందేనని నాకు తెలిసిన వాళ్ళెవరో చెప్పారు. వివరాలు కనుక్కోమని అన్నాను. వీలు చూసుకుని ఒకసారి అక్కడికీ వెళ్ళి రావాలి. ఆరోగ్యం ముఖ్యం కదురా!” మళ్ళీ అన్నాడు మామయ్య.

తరవాత మామయ్య వాళ్ళు ఆగ్రా వెళ్తున్నారని తెలిసినపుడు అమ్మ తనూ వెళ్ళటానికి సిద్ధపడింది. కానీ అక్కడ ఆశ్రమంలో వసతి తక్కువ కాబట్టి రద్దీ ఉంటుందని ముందుగానే పేర్లు రిజిష్టరు చేయించుకోవాలనీ, తాము వెళ్ళొచ్చాక ప్రయోజనం ఉంటుందనిపిస్తే అప్పుడు వెళ్ళొచ్చనీ సలహా ఇవ్వటంతో ప్రయాణం మానుకోవాల్సి వచ్చింది. అందుకే ఇప్పుడు ఆ విషయాలు తెలుసుకు రమ్మని అమ్మ పురమాయించింది.

మరునాడు నేను ప్రయాణమై వస్తోంటే అమ్మ "మర్చిపోకు" అంటూ మళ్ళీ గుర్తుచేసింది. "ఆఫీసు పని అయినా మర్చిపోతానేమోగానీ, నెల్లూరు వెళ్ళినప్పుడు మామయ్య వాళ్ళింటికి వెళ్ళడం మాత్రం ఎప్పుడూ మర్చిపోనుకదా!" అన్నాను నవ్వుతూ.

ఆ మాట నిజమే! మామయ్య చెప్పే సరదా కబుర్లు వినటమన్నా, అత్తయ్య చేతి కమ్మని వంట అన్నా నాకు ప్రత్యేకమైన ఇష్టం ఉంది మరి!

నన్ను చూసి మామయ్య "రా రా... గోపీ" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు. భోజనాలయ్యాక మేం తీరుబడిగా కూర్చున్నప్పుడు అమ్మ చెప్పిన సంగతి అడిగాను.

"ఏమిటోరా... ఏదైనా వెళ్ళేముందు విన్నదొకటిగా, అక్కడికి వెళ్ళాక వేరొకటిగా ఉంటోందిరా!" అంటూ నవ్వాడు. తర్వాత తాజ్‌మహల్ సౌందర్యం గురించీ, పరిసరాల గురించీ చెబుతోంటే... నేను ఆ ఆశ్రమంలోని వైద్య విధానం గురించి వాకబు చేశాను.

"ఏముందీ... ఆ ఆశ్రమంలోని పెద్దాయన మా చేతిలో ఒక తులసీదళం పెట్టి 'శివుడాజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు. ఏ రోగమైనా మిమ్మల్నేమీ చేయలేదు. ఆయుష్షున్నన్నాళ్ళూ బతికితీరతారు. కాబట్టి భగవన్నామ స్మరణ చేసుకుంటే ఆరోగ్యమూ, ఆత్మానందమూ కలుగుతాయి" అంటూ మంత్రోపదేశం చేశారు! ఆ ఆశ్రమ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి ఎవరికైనా సగం ఆరోగ్యం చక్కబడుతుందనుకుంటా!" అన్నాడు. "నేను పట్టువదలని విక్రమార్కుడిలాంటి వాడిని కదా – ఇంకెక్కడయినా మంచి చికిత్సాలయాలున్నాయేమోనని వాకబు చేయటం అప్పుడే మొదలుపెట్టాను" అంటూ పెద్దగా నవ్వాడు.

నేనూ నవ్వుతూ అన్నాను – "రోగం తగ్గేవరకూ ఎక్కడికైనా సరే తిరగాల్సిందేనని అమ్మా అంటుంటుంది! ఏ వైద్యం గురించయినా మళ్ళీ ఎవరైనా చెబితే, అక్కడికి వెళ్లేటపుడు మీతో అమ్మనీ తీసుకెళ్లండి మామయ్యా... ఏమంటావు?" అన్నాను.

ఇంతలో ఏవో భయంకర భీకర శబ్ధాలు వినిపించి నేను ఉలిక్కిపడ్డాను. మామయ్య పెద్దగా నవ్వుతూ "భయపడ్డావా... మా మనవలు ముగ్గురూ గొప్ప మిమిక్రీ కళాకారులు! పోటీలు పెట్టుకుని అలా రకరకాల శబ్ధాలను ప్రాక్టీసు చేస్తుంటారు!" అన్నాడు.

అత్తయ్యకు చెవుల్లో హోరు ఎందుకు వచ్చిందో నాక్కొంచెం అర్థం అయింది. పూర్తిగా చెవుడు రాకపోవటమే విచిత్రం అనిపించింది కూడా!

మామయ్య "నీకీవేళ ఒక విషయం వివరంగా చెబుతాను!" అన్నాడు.

నేను ఏమిటన్నట్లుగా ఆసక్తిగా చూశాను. మామయ్య మొదలుపెట్టాడు.

"చిన్నప్పుడు మా నాన్నని 'ఈరోజు మంగళవారమే కదా' అనడిగాననుకో, దానికి అవునని చెప్పటం నాన్నకి ఇష్టం ఉండేది కాదు. 'నిన్న సోమవారం కదరా వెధవా...' అనో 'రేపు బుధవారం కదురా బడుద్దాయీ...' అనో చెప్పేవాడు. 'సైకిల్ కొనిపెట్టు నాన్నా' అనడిగితే నా కోరిక తీర్చినట్లుండటం

నాన్నకి నచ్చేది కాదు. 'ఆపుడే సైకిల్ తొక్కే వయసొచ్చేసిందనుకుంటున్నావా... పక్కింటి అబ్బాయి దగ్గర స్కూటర్ నడపటం నేర్చుకునేడువ్... ఆ బండికొంటాను!' అన్నాడు నా చిన్నప్పుడు. చిన్నపిల్లల ఇష్టాల్ని తీర్చటం కన్నా వాళ్ళ మాటల్ని అంగీకరించటం చిన్నతనంగా ఫీలయ్యేవాడు కాబోలు!

అందుకే నేను పెళ్ళి చూపుల్లో మీ అత్తయ్యని చూసినపుడు 'అమ్మాయి మొహం అంత కళగా లేదు కదా' అన్నాను నాన్నతో. నేను అమ్మాయి బావుందని మురిసిపోతూ చెబితే ఫలితం ఇంకోలా ఉంటుందని భయపడ్డాను! నాన్న తెలియకుండానే పెళ్ళి విషయంలో నా కోరిక తీర్చాడు.

ఇక మా అమ్మ గురించి... తన అత్తగారి ముందు చేతులు కట్టుకుని నిలబడి తల ఊపుతూ రోజుల్ని గడిపినందువల్ల, కొడుకు పెళ్ళి ఎప్పుడవుతుందా... అధికారం చెలాయించటానికి ఒక ప్రాణి తనకి ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురు చూసి నా పెళ్ళవగానే కోరిక తీరినట్లుగా ఊపిరి పీల్చుకుంది. ఇక ఉమ్మడి కుటుంబ పని భారాన్నంతా కోడలి భుజానికి ఎక్కించేసింది!

నేను పెళ్లయిన కొత్తల్లో మీ అత్తయ్యని తన పుట్టినరోజున ఏం కావాలని అడిగాను. తను చెప్పటానికి చాలా సందేహిస్తూనే 'మూడు చోట్ల మూడు ఫోటోలు తీయించుకోవాలను'ందని చెప్పింది. తన సందేహం చూసి నేను మనసులో బితుకుబితుకుమంటూ ఉన్నాను ఏం అడుగుతుందోనని! సంపాదిస్తున్నా గానీ సొంతంగా ఏ వస్తువయినా కొనే స్వేచ్ఛ నాకు లేదు మరి! పెద్దవాళ్ళ పర్మిషను కావాల్సిందే!

తన మాటతో ఊపిరి పీల్చుకుని చాలా ఆనందంగా 'మూడు కాకపోతే నాలుగు తీయించుకుందాం. ఒకటి ఇంటి ముందు మందారమొక్క దగ్గిరా, రెండోది పెరట్లోని మామిడి చెట్టు దగ్గిరా, మూడోది డాబాపైనా, కావాలంటే నాలుగోది ఇంట్లో సోఫాలో కూర్చుని తీయించుకుందాం...! సాయంకాలమే ఫోటోగ్రాఫర్‌ని రమ్మంటాలే!' అన్నాను.

అప్పుడు మీ అత్తయ్య అసలు సంగతి నిదానంగా చెప్పింది. ఒక ఫోటో ఆగ్రాలోని తాజ్‌మహల్ దగ్గిరా, రెండోది మైసూర్‌లోని బృందావన్ గార్డెన్స్‌లోనూ ముచ్చటగా మూడోది కన్యాకుమారిలోని సముద్రపు ఒడ్డునా అట! నాలుగో ఫోటోకి కూడా నేను వరమిచ్చేశాను కాబట్టి కాశ్మీరులోని యాపిల్ తోటల్లో అయితే బావుంటుందని అంది!! పెళ్లయి అత్తారింటికి వచ్చేవరకూ పొరుగూరన్నదే ఎరగదు కాబట్టి ఊళ్ళుచూడాలనే గాఢమైన కోరిక తనలో ఏర్పడిందని వివరించింది.

ఆ మాటలు వినగానే నా గుండె గుభేలుమంది! ఎలాగో తట్టుకుని 'వెంటనే కుదరదు కాబట్టి నిదానంగా చూద్దాంలే' అన్నాను. ఒకసారి ఎక్కడికో ప్రయాణం పెట్టుకుంటే నాన్న కాలు బెణికిందంటూ మంచం ఎక్కాడు! 'ఈ పరిస్థితిలో నువ్వు దగ్గిర లేకపోతే ఎలాగరా..?' అన్నాడు ఏదో ప్రాణాంతకమైన జబ్బు వచ్చేసినట్లుగా!

ఇంకోసారి ప్రయాణమయ్యేసరికి నడుం నొప్పితో అమ్మ మంచం ఎక్కింది. దీంతో నాకు అనుమతి లభించదని అర్థం అయింది! అంతమందికి వండి వడ్డించే బాధ్యతని కొన్నాళ్లయినా సరే స్వీకరించటానికి అమ్మ సుముఖంగా లేదు మరి!

ఇక పిల్లలూ, చదువులూ, వాళ్ళ పెళ్ళిళ్ళూ – ఇలా చుట్టుకున్న బాధ్యతలవీ తీరి... ఇప్పుడు మనవలు స్కూలుకెళ్తున్న రోజులు కూడా వచ్చేశాయి!"

మామయ్య నా వేపు ప్రశ్నార్థకంగా చూస్తూ "ఏంట్రా... ఏదో ఆలోచిస్తున్నట్లున్నావ్?" అన్నాడు.

"నాకు మతిమరుపు ఎక్కువై పోతోంది మామయ్యా! నేనడిగిన ఏ ప్రశ్నకి సమాధానంగా ఈ కథ చెప్పావా అని ఆలోచిస్తున్నాను!" అన్నాను చిరునవ్వుతో.

"చమత్కారం చాల్లేరా...! నేనడిగిందే మిటో, నువ్వు చెప్పిందేమిటో అని అడగలేక ఇలా అంటున్నావని అర్థం అయిందిలే! అయినా మరీ అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పాలా... అర్థం చేసుకోలేవూ...?" అన్నాడు నవ్వు మొహంతో అప్పుడు నా మనసులో మెరుపు మెరిసింది. హమ్మ... మామయ్య అనుకున్నాను!

"నిన్న నేను ట్రైనులో వస్తోంటే... ఒకాయన వాటర్ బాటిల్‌లో పోసుకున్న విస్కీని తాగుతున్నాడు. ఎదురుసీట్లో కూర్చున్న పెద్దావిడ మనవడికి కాసిని మంచినీళ్లు ఇమ్మని అడిగేసరికి ఆయనకి ఏం చెప్పాలో తోచక పాపం తికమకపడిపోతూ నా వేపు చూశాడు. నేనపుడు నా మంచినీళ్ల బాటిల్ ఆవిడకు ఇచ్చాను!"

ఎందుకు చెప్పానో అర్థం కానట్లుగా చూస్తోంటే... "అతను కూడా నీలాంటివాడే కదా మామయ్యా... నీ మాటలు విన్నాక అతను గుర్తుకువచ్చాడు. అతనూ నీలాగే లేబుల్ మార్చాడు!" అన్నాను నవ్వుతూ.

ఆ వయసులో విహారయాత్రలనే పేరు బావుండదని తన ప్రయాణాలకు వైద్యం కోసమనే లేబుల్ తగిలించాడు. మామయ్యకు వైద్యమనేది సెకండరీ మాత్రమే! అత్తయ్య కోరికను తీర్చే సావకాశం మామయ్యకి ఇన్నేళ్ళ తరవాత లభించిందన్నమాట!

"మామయ్యా... సిమ్లాకి దగ్గిర్లో ఏదో ఊళ్ళో గొప్ప యోగాశ్రమం ఉందని విన్నాను. ఆ వివరాలు కనుక్కొని చెప్పమంటావా... నువ్వే వాకబుచేస్తావా?" అనడిగాను చిరునవ్వుతో.

ప్రసిద్ధి చెందిన ఏ నగరం దగ్గరయినా ఏదో ఊరు ఉంటుంది. ప్రజలూ ఉంటారు... వాళ్ళ కోసం వైద్యులూ ఉండే ఉంటారు కదా... అందుకే అలా అడిగాను.

అర్థం అయినట్లుంది. మామయ్య పెద్దగా నవ్వాడు. అక్కడకి అపుడే వచ్చి మాటల్ని విన్న అత్తయ్య మొహంలో సిమ్లా ప్రయాణం గురించిన ఊహల వల్ల కాబోలు ముసి ముసి నవ్వుల పువ్వులు విరబూశాయి! శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రయాణాలు కూడా ఉపకరిస్తాయనిపించింది. అందుకే... వైద్యానికి ఎక్కడికి తీసుకువెళ్ళాలో తరవాత ఆలోచించ వచ్చుగానీ ముందుగా అమ్మని యాత్రా స్పెషల్‌లో పంపించటానికి ఇంటికి వెళ్లగానే టికెట్ కొనాలని నిర్ణయించుకున్నాను! తగిన ఉపాయాల అస్త్రసాల్ని మనసులోనే సేకరిస్తూ, వ్యూహరచన మొదలుపెట్టాను! భార్య దగ్గర మార్కుల్ని సంపాదించుకోవటం మాత్రమే కాదు, అమ్మ చూపుల్లోని ప్రశంసను పొందగలగటమూ ముఖ్యమేననిపించింది మరి!

ఈనాడు ఆదివారం. 7, సెప్టెంబరు, 2003.